


# సర్పశిల

## – భువనచంద్ర



*(గత సంచిక తరువాయి)*

*ఇప్పటివరకూ జరిగిన కథ*

*ఓ అడవిలోనున్న ఆలయం దగ్గర మొదలైన కథ, 'రాబీ వెబ్‌స్టర్ ' అనే అమెరికన్ ఇండియాలో దిగడంతో ఓ మలుపు తిరుగుతుంది. 'తక్షపురం 'లోని సర్పశిల ఒక మలుపుకి సంకేతమైతే 'నల్లమల 'లో జరిగిన విశ్వశాంతి యజ్ఞం మరో మలుపు. ఒక వైపున కొన్ని శక్తులు ప్రకృతి విధ్వంసానికి రచన చేస్తూంటే మరోవైపు ప్రకృతి రక్షకులు ప్రకృతిని కాపాడే ప్రయత్నాలు ముమ్మరం చేస్తుంటారు. అనేకానేక పాత్రలు తమ విధిని నిర్వర్తిస్తూవుంటాయి. అందరి లక్ష్యమూ ఒకటే - విశ్వశాంతి.*

"**అన్వేషణ ఎవరితోనైనా** మొదలుకావొచ్చు. అది వస్తువు కోసమో వ్యక్తి కోసమో అయితే త్వరలోనే ముగుస్తుంది. కానీ, ఒక అమూల్యమైన దానికోసమో, ఆత్మకోసమో అయితే ఎప్పుడు ముగుస్తుందో ఊహించనేలేము. అటువంటి అన్వేషణ దశాబ్దాలపాటూ సాగొచ్చు. ఒక్కోసారి శతాబ్దాలపాటూ సాగొచ్చు. అయ్యా.. మీరందరూ విజ్ఞులు. మీ ఎదుట నిలిచి మాట్లాడే అర్హత నాకులేదు. కానీ, నిజం అనేది విజ్ఞతని కూడా విస్మయపరుస్తుంది. మహాభారత యుద్ధం ముగిసిన నించే ఓ అన్వేషణ ప్రారంభం అయింది. ఆ అన్వేషణ ఆభరణాల కోసం ఆయుధాల కోసం. వంటవారూ, వడ్డించేవారూ, క్షతగాత్రులకు ఔషధమిచ్చి పరిచర్యలు చేసేవారు, వార్తాహరులూ, శవవాహకులూ ఎవరికి వారు దొరికినన్ని ఆభరణాల్నీ ఆయుధాల్నీ రహస్యంగా దోచుకుని పాతిపెట్టారు. యుద్ధానంతరం ఓ చిత్రం జరిగింది. ఓ ప్రళయ భయంకరమైన వర్షం కురిసింది. అది ఎటువంటిదంటే" ఆగాడు రామజోగి తిరుపతిలో అందర్నీ కలిశాక.

రాబీ, శాస్త్రిగారు, యజ్ఞప్ప, మదాలస, సుదర్శన్, జై అందరూ వింటున్నారు. వారిలో కొందరు వెళ్ళిపోవడానికి మూటాముల్లె సర్దుకున్నా వెళ్ళలేకపోయారు. సుదర్శన్ దృష్టి మదాలస మీద ఉంది. మదాలస దృష్టి ఎవరిమీదా లేదు.

"ఊ.. చెప్పండి." ఉత్సాహంగా అన్నది మదాలస.

"చెప్పాగా అదో భయంకరమైన వర్షం. మూడు రోజులు కుండపోతగా కురిసింది. ఎంతగా అంటే, పారిన రక్తం అంతా తుడిచిపెట్టుకుపోయింది. అక్కడసలు ఓ మహా యుద్ధమే జరిగిన ఆనవాళ్ళు లేనంతగా. ఆయుధాలూ ఆభరణాలూ ఏమైపోయాయో వర్షం వెలిశాక తవ్వి చూసిన వాళ్ళకి తెలియలేదు. రహస్యంగా పాతి పెట్టిన వారందరికీ ఆశ్చర్యమేసింది. అసలు తాము పాతిపెట్టిన మాట నిజమేనా? అనే సందేహమూ కలిగింది. ఒక్క ఖడ్గం, ఒక్క శూలం, ఒక్క డాలు, ఒక్క బరిశ కూడా ఎవరికీ చిక్కలా. ఏమై పోయాయో ఎవరికీ తెలీదు" ఆగాడు రామజోగి.

అతని కళ్ళు శతాబ్దాల వెనకనున్న దృశ్యాన్ని చూస్తున్నాయి.

"ఆభరణాలు సరే. మరి ఆయుధాలు ఎందుకూ?" అడిగాడు సుదర్శన్.

"రాజులు సైనికులూ పోయినా రాజ్యాలు ఉన్నాయిగా. కత్తులూ, డాలులూ, ఈటెలూ, బరిసెలూ, విల్లులూ, విల్లంబుల సూది ముక్కులూ ఇవన్నీ తక్కువ సంఖ్యలో లేవుగా రెండూ మూడూ కాదు, 18 అక్షౌహిణీల సేన. అంటే ఎన్ని కత్తులూ, డాళ్ళూ, శూలాలూ, బరిశలూ ఉండాలీ?" అవి తయారు చేయబడ్డది కూడా సాదాసీదా లోహాలతో కాదు. ఆ ఆయుధాలనన్నీ పోగేస్తే హిమాలయం ఎత్తున ఓ కొండే ఏర్పడుతుంది. వాటిని అమ్మితే? అందుకోసమే శవవాహకులూ, వంటవారు, వైద్య సేవకులూ పోటీలు పడీ మరీ వాటిని కట్టలు కట్టలుగా దాచింది" అన్నాడు రామజోగి.

"ఓరి నాయనోయ్.. అప్పుడూ మానవుల్లో ఇలాంటి నైజం వుందా?" ఆశ్చర్యంగా అన్నది మదాలస.

"అమ్మా.. అది ఒక వూహాతీతమైన యుద్ధం. అందులో శత్రువులు ఎవరు? అన్నదమ్ములూ, మేనమామలూ, బావలూ, తాతలూ, తండ్రులూ, మనవలూ, గురువులూ, బంధువులు, మిత్రులూ వీరేగా! వీరేగా యుద్ధంలో పాల్గొని ఒకరినొకరు తెగ నరుక్కుని చరిత్ర ఏనాడూ మరచిపోనంత రక్తపాతం సృష్టించిందీ" సుదీర్ఘంగా ఓ నిట్టూర్పు వెలువడింది రామజోగి నాశికనించి.

"అవునుకదూ.. శత్రువులెవరూ?" ఆశ్చర్యంతో అన్నది మదాలస.

"మానవుడి జీవితం క్షణాల మూటకాదు. భావోద్వేగాల మూట. ప్రతిక్షణమూ ఓ భావమూ భావం తాలూకా ఆవేశం తొంగి చూస్తూనేవుంటుంది. ఆవేశానికిచ్చినంత సమయమూ, విలువా మనిషి ఆలోచనకు ఇవ్వడు. ఆలోచించగలిగితే ఆవేశం అదుపులోనే వుంటుంది. ఆలా ఆవేశాన్ని అదుపులో పెట్టగలిగితే యుద్ధాలకి తావేదీ?" రామజోగి మనసులో ఒక వ్యధ పెల్లుబికి స్వరంలో తొంగిచూసింది.

"వర్షం ఆయుధాలని ప్రవాహంలో కొట్టుకుపోయేట్టు చేసిందా?" రాబీ స్వరంలో కొంచెం వ్యంగ్యం.

"రాజస్తాన్ ఎడారిలోనే కాదు, హిమాలయాల్లోనూ, ఆల్ప్ పర్వతాలపైనా కూడా కొన్ని ఆల్చిప్పలు, సముద్ర జీవుల అవశేషాలూ కొందరు పర్వతారోహకులకు దొరికినై. అంటే ఆ ఎత్తైన పర్వతాలూ, ఎడారులూ కూడా ఒకప్పుడు

సముద్రాల్లో వున్నవనే అర్ధమవుతుందిగా! మిస్టర్ రాబర్ట్ యీ ప్రకృతి ఓ రహస్యాల నిధి. అన్నీ దానికి తెలుసు. అందుకే మౌనంగా వుంటుంది" మెల్లగా అన్నాడు రామజోగి.

"అవునవును ఆ మధ్య ఏదో పత్రికలో చదివాను" అన్నాడూ సుదర్శన్.

"అలగే, కాలప్రవాహంలో కొట్టుకుపోనివి ఏవీ? కొట్టుకు పోయీ వుండొచ్చు. కప్పబడిపోయీ వుండొచ్చు. మిస్టర్ రాబర్ట్ మీరేకదూ స్వప్నంలాంటి స్వప్నంలో మహాభారతకాలం నాటి ఆయుధాల గురించి కలవరించిందీ, చెప్పిందీ. మీది యీ దేశం కాదు. ఈ దేశంలోని ఏ భాషా మీకు రాదు. అసలు రామాయణ మహాభారతాల విషయమే మీకు తెలీదు. అలాంటిది మీ స్వప్నంలో ఆయుధాలు కనిపించడమేమిటీ? మీరు లేస్తూనే అవి మహాభారత కాలంనాటివని చెప్పడమేమిటీ? గోవిందరాజ స్వామి ఆలయంలో 'తండ్రీ' అని తెలుగులో అరవడం ఏమిటీ? జీవితంలో ఏనాడూ మీరు వినని 'గుడి మల్లం' వూరికి వెళ్ళాలని అనడం ఏమిటి? స్థూలంగా చూస్తే ఇవన్నీ గాలికి కొట్టుకుపోయే మాటలు. కానీ, సూక్ష్మంగా ఆలోచిస్తే మీ ఆత్మవశించిన శరీరపు మానసిక జ్ఞాపికలు. అదీ ఎన్ని తరాలు? ఉహూ.. కాలమే లెక్కించగలదు" మౌన ముద్రపట్టాడు రామజోగి.

"సారీ రాంజోగిగారూ.. నా గొంతులో హేళన నాకే స్పష్టంగా వినిపించింది. ఈ తెల్ల శరీరానికి సహజంగా సంక్రమించిన గుణం అది. మేమే గొప్పవాళ్ళనుకోవడం. ఇతర వర్ణాల వారిని హీనపరచడం నన్ను క్షమించండి" వినమ్రంగా ఇంగ్లీషులో అన్నాడు రాబీ.

"ఓహ్.. అదేం పరవాలేదు" చిన్నగా నవ్వి అనునయంగా అన్నాడు రామజోగి.

"కింకర్తవ్యం? ఇప్పుడు ఏమి చేద్దాం?" అన్నాడు సుదర్శన్.

"ముందు గుడిమల్లం వెళ్ళి తరువాత ఏం చెయ్యాలో ఆలోచిద్దాం అన్నారు యజ్ఞప్ప.

శిధిలాలయం

"స్వామీ.. ఒక అపూర్వమైన రాయి లభించింది" మహదానందంతో ఒక బండరాయిని అరిదమన, అలంబస, సంకల్పానందల ముందు పెట్టి అన్నాడు మట్టూ. అతనితో శృంగీ, నీలుడు కూడా వున్నారు. ఆ రాయి ఓ గుండిగలాగ గుండ్రంగా ఉంది. ఎంత గుండ్రంగా అంటే బంతిలాగా. చిత్రమేమంటే సూర్య రశ్మి దానిమీద పడితే పసుపు, ఆకుపచ్చ, ఎరుపు రంగులు దానిలోంచి తెరలు తెరలుగా ప్రతిఫలించడం.

"ఓహ్....అద్భుతం మట్టూ. దీన్ని మహేంద్రజాల పాషాణమంటారు.మాయాజాల ప్రదర్శనలో దీని పాత్ర చాలా ఎక్కువ. జనాల దృష్టి మళ్ళించడానికి ఇంద్రజాలికులు దీన్ని వాడతారు. ఇంతపెద్ద పరిమాణంగల శిలాబంతిని చూడటం ఇదే మొదటిసారి" ఆశ్చర్యంగా దాన్ని ముట్టుకుని, షాక్ తిన్నట్టు చెయ్యి వెనక్కి లాక్కున్నాడు అలంబసుడు.

"అదేంటీ?" ఆశ్చర్యంగా అన్నాడు అరిదమనుడు.

"దీనిలో జీవం వుంది అరిదమనా" నిర్ఘాంతపోయి అన్నాడు అలంబసుడు.

"అదేమీ నేను ముట్టుకున్నప్పుడు ఏమీ అనిపించలేదే" అన్నాడు నీలుడు.

"అయ్యా. రంగుల్ని అద్భుతంగా ప్రతిఫలిస్తున్న యీ శిల, ముమ్మాటికీ సజీవమైనది. నా హస్త స్పర్శకి ఆ జీవపు ఉనికి తెల్లమయింది" ఇంకా ఆశ్చర్యమ్నించి తేరుకోకుండానే అన్నాడూ అలంబసుడు.

"సజీవమా" అన్నాడు అరిదమనుడు.

"అవును. కాలీ గంజకీ నదీ తీరంలో ఇప్పటికీ సజీవ సాలిగ్రామాలు లభిస్తాయి. అంతెందుకూ మన తిరుమల హాథీరాం మఠ్‌లో ఇప్పటికీ మనం సజీవ సాలగ్రామాలను చూడొచ్చు. ఖాట్మండులోని పశుపతినాథ లింగమూర్తీ సజీవమే. అలాగే ఇది కూడా. దీనిని ఇలాగే జీవన స్థితిలో వుంచాలంటే కొన్ని పద్దతులు ఉన్నాయి. సజీవ రుద్రాక్షలూ ఉన్నాయని తెలుసుగదా" అన్నారు సంకల్పానంద. "40 బారువుల బంగారమిచ్చే శమంతకమణీ ఓ సజీవ సాలగ్రామమే" అన్నాడు అలంబసుడు.

"ఎక్కడ లభించిందీ?" అడిగాడు అరిదమనుడు.

"రోజూలాగే ఔషధ మొక్కలకోసం, యజ్ఞ సమిధల కోసం వెతుకుతున్నాం. ఈ శృంగి మమ్మల్ని హఠాత్తుగా ఆగమన్నాడు. 'ఎందుకు' అన్నా. ఆయన ఓ గుట్ట దగ్గరికి వెళ్ళి అక్కడి శిలలను తొలగించసాగాడు. మేమూ మారు మాట్లాడక ఆయనకి సహాయం చేస్తున్నాం. దాదాపు రెండు ఘడియల తరువాత అద్భుతమైన ఓ వెలుగు మా కళ్ళకి మిరుమిట్లు గొలిపింది. తవ్వి చూస్తే ఇదీ" అన్నాడు నీలుడు.

"అసలు అక్కడికి వెళ్ళాలని నీకెందుకు అనిపించింది శృంగీ?" అన్నాడు అలంబసుడు.

"అయ్యా.. క్రితం సారి ఇక్కడినించి నా గురువు దగ్గరికి వెళ్ళకముందే నాలో ఓ చెప్పలేని మార్పు వచ్చింది. నిరంతరం కళ్లలో మన పద్దెనిమిది చేతుల అమ్మవారే. ఆఖరికి నిద్రలోనూ ఆవిడ స్మరణ నా మనసులోనించి తొలగలా. మళ్ళీ ఇక్కడికి వచ్చెయ్యాలని ఓ ఉన్మత్తత, గురువుగారివద్ద శలవు తీసుకుని వచ్చాను. మట్టూనీ, నీలుడినీ చూస్తే నా ఆప్తబంధువులు మళ్ళీ నాకు దొరికినట్టనిపించింది. అడవిలో వెదుకుతుంటే, అప్రయత్నంగానే నా అడుగులు ఆ గుట్ట దగ్గరికి నడిచాయి. నేను నిజంగా నడిచానా అంటే లేదు. అక్కడ అమ్మ కనిపించి నన్ను రమ్మన్నది. నాకు తెలిసింది అంతే" అన్నాడు శృంగి.

సంకల్పానంద కళ్ళలోంచి బొటబొటా కన్నీరు కారింది. అలంబస అరిదమనులు నిశ్చేష్టులయ్యారు. గుండ్రంగా బంతిని పోలిన ఆ అద్భుతశిల అమ్మవారి నేత్రాల్లా అద్భుత కాంతులీనుతోంది. మిగతా అందరూ అవాక్కై నిలుచున్నారు.

"ఎంత అదృష్టవంతుడివి శృంగీ. స్వయంగా అమ్మవారే నీకు మార్గనిర్దేశం చేసింది. లేకపోతే యీ మహాద్భుతం జరుగుతుందా? అమ్మవారి కృపలేకపోతే యీ మహా సాలగ్రామం మనకి లభించేదా. ఓహ్.. నీ జన్మ ధన్యం" లేచి శృంగిని కౌగలించుకుని కన్నీటి ధారలు కారుస్తూ అన్నారు సంకల్పానంద.

"అవును. నిస్సందేహంగా ఇది అమ్మవారి కృపే" అన్నాడు అరిదమనుడు.

"అయ్యా.. ఇప్పుడు జ్ఞాపకం వస్తోంది. మహాభారత యుద్ధంలో అర్ధరాత్రివేళ పద్దెనిమిది చేతుల మహాకాళి నాలిక చాచి తిరుగుతుండేదని. ఆ అమ్మే యీ అమ్మా" అన్నాడు అలంబసుడు. అతని కళ్ళూ వర్షిస్తున్నాయి.

"ఏమైనా ... అయ్యలారా నివృత్తి యాగం చేసే ముహూర్తం ఇప్పుడొచ్చింది. ఇక అన్నీ దొరుకుతాయి. అన్ని సంభారాలు అమరుతాయి. నిండు మనసుతో యాగం పుర్తిచేద్దాం. విశ్వశాంతి పతాకం నీలాకాశంలో రెపరెపలాడాలి. సర్వదుష్ట, ఘోర, పాశవిక శక్తులూ తిరోగమనం వహించుగాక. శాంతి ఎల్లెడలా నెలకొనుగాక" ఉద్విగ్నంగా అన్నారు సంకల్పానంద. ఏ బ్రహ్మచారికి ఎందుకు బుద్ధిపుట్టిందో.. శిధిలాలయంలో వున్న పెద్ద గంటని మ్రోగించడం మొదలు పెట్టాడు. ఇతర బ్రహ్మచారులు వెళ్ళి లయబద్ధంగా అక్కడున్న 18 గంటల్ని మ్రోగించడం మొదలుపెట్టారు. కొందరు శంఖాల్ని పూరించడం మొదలెట్టారు. కొందరు భిల్ల బాలురు వాళ్ళ దగ్గరున్న డప్పుల్ని అప్రయత్నంగా మోగించసాగారు. ఆ కారడవిలో మిట్టమధ్యాహ్నం హరివిల్లె విరిసింది. ఇంద్రధనసు వర్ణాలు ఆకాశాన్ని ఆక్రమించాయి. ఆలయం ఆ ఆపర్ణాహపు ఎండలో స్వర్ణకాంతులీనింది. అమ్మవారి చూపుల్లో కరుణ. చిరునవ్వులో కరుణ. ఆ నవ్వు ఎంత అందంగా ఉన్నదంటే మానస సరోవరంలో పుట్టిన పద్మం అప్పుడే తన రేకుల్ని విచ్చుకుంటే ఎంత అద్భుతంగా అందంగా ఉంటుందో అంత అందంగా ఉంది. కొందరు భిల్లబాలురు శంఖధ్వనులకూ గంటల లయకీ మైమరచి నాట్యమాడసాగారు. కొలను లోని చేపలు వెండి చేపల్లా గాలిలోకి ఎగిరి ఎగిరి మళ్ళీ కొలనులోకి దూకి, మళ్ళీ ఉత్సాహంగా మరింత ఎత్తుకి ఎగురుతున్నాయి. పక్షులు సంతోషంతో రెక్కలల్లారుస్తూ శుభగీతాలు పాడాయి. అడవి పులకించింది.

**గుడిమల్లం**

గుడిమల్లం తిరుపతి విమానాశ్రయం దగ్గర్లోనే వుంది. భూమికంటే పది అడుగుల పల్లంలో యీ గుడి నిర్మించబడివుంది. అందుకే గుడిపల్లం అంటారు. ఈ శివాలయాన్ని భారత దేశంలోనే మొట్టమొదటి శివాలయం అంటారు. గుడిపల్లమే తరవాత గుడిమల్లం అయింది. ఇక్కడ పరశురామేశ్వరుడు మాత్రమేకాక శ్రీవేంకటశ్వరుడు, వల్లీ దేవసేనా సమేత కుమారస్వామి, సూర్యుడు, రాతిగోడలపై బ్రహ్మ, వినాయకుడు, దుర్గవంటి దైవాల్ని దర్శించుకో వచ్చు. యజ్ఞప్ప, శాస్త్రిగారు, సుదర్శన్, మదాలస, జై, రాబీ అందరూ గుడిమల్లం శ్రీ పరశురామేశ్వరాలయానికి వచ్చి పూజలు చేశారు. బ్రాహ్మణుడు చెప్పింది చెప్పినట్టుగా చక్కగా పలికాడు రాబీ. ముందుగానే ఆచార్యుల వారికి విషయం చెప్పడం వలన వారూ నిష్టగా పూజలు చేయించారు.

"ఈ రోజు చక్కని ప్రసాదాలు చేయించాను. తమరు ఇక్కడే భోంచేసి వెళ్ళండి" గౌరవంతో అన్నారు ఆచార్యులవారు. "అలాగే" ఒప్పుకున్నారు అందరూ. సమయం దాదాపు పదకొండు అయింది. అందరూ చక్కగా నేలమీదే కూర్చున్నారు .సడన్‌గా మబ్బులు కమ్ముకుని వాతావరణం చల్లగా మారింది.

"అబ్బ ఎంత ఆహ్లాదకరంగా ఉందీ" సంతోషంతో పొంగిపోతూ అన్నది మదాలస. ఆమె చెప్తూ వుండగానే ఓ కారు వచ్చి ఆగింది. అందులోంచి శరద్వతీ, శ్రీనివాసూ, శ్రీనివాస్ తల్లిగారూ దిగారు.

"ఓహ్.. శ్రీనివాస్. ఇన్నాళ్ళూ ఎక్కడున్నావ్"ఆనందంగా జయ్ అన్నాడు శ్రీనివాస్‌ని కౌగిలించుకుని.

"అదో పెద్ద కథ గురూజీ తరువాత చెబుతా" అని, శాస్త్రిగారికీ యజ్ఞప్పకీ పాదనమస్కారం చేసి, యజ్ఞప్ప వైపు తిరిగి, "అయ్యా మిమ్మల్నింతకుముందు చూడలేదు. అయినా అభ్యర్థిస్తున్నాను. మీరూ, మా గురువుగారైన పరమేశ్వర శాస్త్రిగారూ, మిగతా మనో బంధువులందరూ దగ్గరుండి నా వివాహాన్ని జరిపించాలి" అన్నాడు శ్రీనివాస్.

"ఇప్పటికిప్పుడా?" ఆశ్చర్యంగా అన్నారు శాస్త్రిగారు.

"చెయ్యొచ్చు. అభిజిత్తు లగ్నంలో ఏ శుభ కార్యమైనా చెయ్యొచ్చు. ఓ క్షణం ఆగి అన్నారు శాస్త్రిగారు "అవును" సపోర్టుగా అన్నారు యజ్ఞప్ప, ఆచార్యులవారు. అప్పటికప్పుడు మాలలు తెప్పించారు. ఖచ్చితంగా పన్నెండు గంటలకి దైవ సాన్నిధ్యంలో దండలు మార్చుకుని, ఉంగరాలు మార్చుకుని పాణిగ్రహణం చేశారు శ్రీనివాస్, శరద్వతి.

అందరూ ఆనందంతో నిండుగా ఆశీర్వదిస్తుండగా గుడి ఆచార్యూలారన్నారు, "బాబూ, యీ స్వామిని సంతాన ప్రదాత అంటారు. పిల్లలు లేనివాళ్ళు యీ ఆలయంలో నిద్రచేసి, బిడ్డలు పుట్టాక వారికి గుడి మల్లయ్య, గుడిమల్లమ్మ, మల్లీశ్వరి అని పేర్లు పెడతారు. అభిజిత్తు లగ్నం, శివునికి ప్రీతి అయిన సోమవారంనాడు మీరు వివాహం చేసుకున్నారు. సంవత్సరం తిరక్కుండా మీకు పండంటి సుపుత్రుడు పుట్టాలి. ఆ బిడ్డ మహర్జాతకుడు కావాలి" అని ఆశీర్వదించారు.

ఆయన తెలుగులో ఏమని ఆశీర్వదించారో తెలియకపోయినా, ఆ ఆశీర్వాదంతో మనసు నిండిపోగా శరద్వతి శ్రీనివాసు చెయ్యిపట్టుకుని సాష్టాంగపడి అందరికీ సాష్టాంగ నమస్కారం చేసింది. ఆమె కళ్ళలో ఆనంద భాష్పాలు. విచిత్రం ఏంటే రాబీ తన వాచి తీసి శ్రీనివాస్‌కి తొడిగి 'ఇకనించీ యీమె నా చెల్లెలు' అన్నాడు ఇంగ్లీషులో. ఓ అద్భుతమైన ఆనందం గుడిలోపల వెల్లివిరుస్తుంటే, గుడిబైట సన్నని చినుకులు పుడమిపైన అక్షితలు జల్లినట్టుగా వర్షించి గాలికి శీతలాన్నీ ప్రకృతికి ఆహ్లాదాన్నీ కలిగించాయి. మాటలతో శ్రీనివాసు శరద్వతి ముచ్చట గొలుపుతుండగా సుదర్శన్ వారిద్దరికీ శుభాకాంక్షలు తెలిపాడు. వధూవరులిద్దరూ శ్రీనివాస్ మాతృమూర్తికి సాష్టాంగ నమస్కారం చేశారు. శ్రీనివాస్ గద్గదంగా, "అమ్మా, జన్మజన్మలకీ నువ్వే నా తల్లివి కావాలి. తల్లేకాదమ్మా, నువ్వే నా దైవం" అని వెక్కి వెక్కి ఏడవడం మొదలుపెట్టాడు. ఆమె తడి తలని నిమురుతూ ఆనంద భాష్పాలు రాలుస్తూంటే, శరద్వతి ఆమె ఒడిలో తలపెట్టుకుంది.

ఊహించని సంఘటనకి అందరూ అవాక్కయినా ఏమీ ప్రశ్నించలేకపోయారు. కాసేపటికి సర్దుకుని శ్రీనివాస్ లేచి "సారీ.. మా అమ్మ యీనాటి అమ్మకాదు, జన్మ జన్మల అమ్మ. అందుకే ఎమోషనల్‌గా ఫీలయ్యాను" అన్నాడు.

అద్భుతమైన భోజనాలు వడ్డింపబడ్డాయి, అవాల్టి రుచి, పదార్థాలతో వచ్చిన రుచికాదు. ఓ దివ్య సాన్నిధ్యంతో వచ్చిన రుచి అది.

పుల్లేటి కుట్ర దగ్గరున్న సత్రంలో భ్రమరాంబ, సోములు, దక్షుడు, చినమల్లుడు కబుర్లు చెప్పుకుంటుండగా ఫకాల్న నవ్వాడు చినమల్లుడు.

"ఏందిరా నవ్వుతుండావూ?" అన్నది భ్రమరాంబ.

"పార్వతీ నవ్వితే

శివుడు నవ్వాడు

శంకరుడు నవ్వితే

గంగ నవ్వింది

గంగమ్మ నవ్వితే

నంది నవ్వాడు

నందీశు నవ్వితే

శృంగి నవ్వాడు

ఆ శృంగి నగవుకి

కొండ అదిరింది

కొండతోపాటుగా

కోన అదిరింది

తీగకీ చెట్టుకీ

పెళ్ళి జరిగిందీ

గారెలూ బూరెలూ

వడ్డించినారూ

గణములన్నన్నియూ

కలిసి తిన్నాయి

తిన్నాక కడుపార

దీవెనలు ఇచ్చి

కలికి భ్రమరాంబకీ

మొక్కులిడినాయి" అని చిలిపిగా భ్రమరాంబ మెళ్ళో చేతులు వేసి గారంగా ముద్దుపెట్టాడు చినమల్లుడు.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Post your comments